క్లుప్తంగా

ఉద్యోగ హామీలు విస్మరించిన పాలకులు

టేకులపల్లి: కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ఉద్యోగాల భర్తీపై ఇచ్చిన హామీలను విస్మరించాయని పీవైఎల్ నాయకులు మోకాళ్ల రమేష్, నోముల భానుచందర్ ఆరోపించారు. మండలంలోని బద్దు తండాలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ, ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ వాటిని విస్మరించి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. కాగా, జూన్ 5, 6వ తేదీల్లో ఖమ్మంలో జరగనున్న పీవైఎల్ రాష్ట్ర మహాసభలకు నిరుద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు లక్ష్మణ్, తోటకూరి సతీష్, రావూరి ఉపేందర్‌రావు, సురేష్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

ఇల్లెందు: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఇల్లెందులో సింగరేణి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. మంగళవారం సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ ఆటల పోటీలలో వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో హెచ్‌ఎం సుధాకర్, జైనుల్లాఉద్దీన్, సేవా సెక్రెటరీ విజయ, సాంబయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం

ఇల్లెందురూరల్: రోహిణి కార్తెలో నిన్న మొన్న భానుడు తన ప్రతాపం చూపించాడు. మంగళవారం ఉదయం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించింది. వర్షం కొద్దిసేపే కురిసినా రోజంతా చల్లటి వాతావరణం ఉంది. ప్రజలంతా చాలా రోజుల తరువాత మధ్యాహ్నం కూడా తమ పనులు చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే వ్యవసాయ పనులకు సన్నద్ధమైన రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్న క్రమంలో ఈ వర్షంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బావి ఆక్రమణపై వివాదం

ఇల్లెందు: పట్టణంలోని సత్యనారాయణపురం ప్రాంతంలో తాగునీటి బావి ఆక్రమణపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో నీటిఎద్దడి దృష్ట్యా సత్యనారాయణపురంలో ప్రభుత్వం ఎనిమిది బావులు తవ్వించింది. ఇందులో ఒక బావిని వార్డు కౌన్సిలర్ ఆక్రమించుకుని పూడ్చివేశారు. దీంతో సత్యనారాయణపురం వాసులు రామాలయం వద్ద సమావేశమై వార్డు కౌన్సిలర్ రవిని నిలదీశారు. ఇంతలోనే మరికొందరు తమ సమీప బావులను కూడా పూడ్చివేస్తామని చెప్పడంతో తారాస్థాయికి చేరుకుంది. కాగా, బస్తీ వాసులు బావుల రక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

బీజేపీ ఎంపీ దిష్టిబొమ్మ దహనం

ఇల్లెందురూరల్: తమకు న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న మహిళా మల్లయోధులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ పీఓడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామంలో బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి మోకాళ్ల రమేష్ మాట్లాడుతూ.. మహిళా మల్లయోధులను లైంగికంగా వేధిస్తున్న ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై చర్య తీసుకోకుండా న్యాయం కోరుతూ ఆందోళన చేస్తున్న మహిళా మల్లయోధులను అరెస్టు చేయడం సరికాదన్నారు. తమ పార్టీ ఎంపీ కావడంతో కేంద్ర ప్రభుత్వం ఆయనను రక్షించే లక్ష్యంతో అరెస్టు కుట్రకు పూనుకుందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై చర్య తీసుకోవాలని లేదంటే దేశ వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రమవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో రావూరి ఉపేందర్, బొర్ర రమేష్, చీమల రుక్మిణి, దేవి, ఉమ, శ్రీదేవి, కల్తి లక్ష్మి, చీమల భద్రమ్మ, సోలెం భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ ఆందోళన



నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

జూలూరుపాడు: మా డబుల్ బెడ్‌రూం ఇళ్లు మాకు అప్పగించాలంటూ పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లాతండా డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం ఎదుట లబ్ధిదారులు చేపట్టిన ఆందోళన మంగళవారం కూడా కొనసాగించారు. వర్షంలో తడుస్తూనే నిరసన తెలిపారు. బాధితులు మాట్లాడుతూ.. లాటరీ పద్ధతిలో మాకు కేటాయించిన ఇళ్లలో ఇతరులు అక్రమంగా నివాసం ఉంటున్నారని వాపోయారు. వారిని అధికారులు తక్షణమే ఖాళీ చేయించి మాకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో లబ్ధిదారులు బోడా శారద, భూక్యా వీరమ్మ, శాంతి, సరోజ, జమ్లీ, ధరంసోత్ మాధవి, బోడా శారద, శిల్ప, అజ్మీర సంధ్య, వాంకుడోత్ సావిత్రి, బానోత్ సాలీ, జి.పావని పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా !

- నెల పాటు సాగిన ఉచిత క్రీడాశిక్షణ శిబిరాలు
- నేటితో ముగియనున్న కోచింగ్
- జిల్లాలోని 12 కేంద్రాల్లో తర్ఫీదు పొందిన 545 మంది బాలబాలికలు



ఫుట్‌బాల్ శిక్షణకు హాజరైన బాలురతో కోచ్‌లు

కొత్తగూడెంటౌన్: జిల్లాలో ఔత్సాహికులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఈనెల 1నుంచి మొదలుపెట్టిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు బుధవారం ముగియనున్నాయి. రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యాన రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాట్స్) సహకారంతో జిల్లా యువజన, క్రీడల శాఖ పర్యవేక్షణ నిర్వహించిన శిక్షణ శిబిరాలకు మంచి ఆదరణ లభించింది. జిల్లాలో 12 చోట్ల శిబిరాలు ఏర్పాటుచేయగా సుమారు 545 మంది బాలబాలికలు ఉత్సాహంగా హాజరై వివిధ క్రీడల్లో శిక్షణ పొందారు. వేసవి సెలవుల్లో పిల్లలను ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు సైతం ఆసక్తి చూపడంతో శిబిరాలు కళకళలాడాయి. ఆయా శిబిరాల్లో ప్రతిరోజు ఉదయం, సాయంకాలం హాకీ, రెజ్లింగ్, కరాటే, తైక్వాండో, అథ్లెటిక్స్, యోగా, ఖో-ఖో, వాలీబాల్, క్రీడాంశాల్లో కోచ్‌లు శిక్షణ ఇచ్చారు.

గత ఏడాది కంటే అదనం.. గత ఏడాది జిల్లాలోని ఎనిమిది కేంద్రాలు ఏర్పాటుచేయగా 438 మంది బాలబాలికలు శిక్షణ తీసుకున్నారు. ఈసారి 12 కేంద్రాలు ఏర్పాటుచేయగా 545 మంది బాలబాలికలకు ఉత్సాహంగా హాజరుకావడం విశేషం.



లక్ష్మీదేవిపల్లిలో కరాటే శిక్షణ పొందుతున్న చిన్నారులు

మంచి స్పందన లభించింది..



బాలబాలికలు తైక్వాండో శిక్షణకు ఆసక్తి చూపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రోత్సహిస్తూ శిబిరాలకు పంపించారు. గతంతో పోలిస్తే ఈసారి స్పందన బాగుంది. విద్యార్థులు పాఠశాలలు మొదలయ్యాక కూడా ప్రాక్టీస్ చేస్తే రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుంది.

– ఇ.మొగిలి, తైక్వాండో కోచ్, కొత్తగూడెం

మాకెంతో ఉపయోగం



వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా నాకు ఇష్టమైన తైక్వాండోలో శిక్షణ పొందాను. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం శిబిరంలో కోచ్ మొగిలి సార్ చాలా బాగా శిక్షణ ఇచ్చారు. సెలవుల్లో ఖాళీగా ఉండకుండా సద్వినియోగం చేసుకోవడంతో పాటు ఇష్టమైన క్రీడలో శిక్షణ పొందాననే తృప్తి మిగిలింది.

– ఇ.సాయిపూజిత, కొత్తగూడెం

సద్వినియోగం చేసుకున్నారు...



గత ఏడాది కంటే ఈ ఏడాది వేసవి ఉచిత క్రీడా శిక్షణ తరగతులకు ఆదరణ పెరిగింది. క్రీడాకారులను తల్లిదండ్రులు ప్రోత్సహించడం ఆనందంగా ఉంది. జిల్లా వ్యాప్తంగా 12కేంద్రాల్లో 545 మంది బాలబాలికలకు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇచ్చాం. కోచ్‌లు చెప్పిన మెళకువలను నేర్చుకున్నారు.

– సీతారాం, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి

చాలా ఆనందంగా ఉంది..



మేము తైక్వాండో శిక్షణకు ప్రతిరోజు క్రమం తప్పకుండా హాజరయ్యాము. వేసవి సెలవులు వృథా కాకుండా శిక్షణ తీసుకోవడం ఆనందంగా ఉంది. శిక్షణలో కోచ్ అనేక మెళకువలు నేర్పించారు. నాతో పాటు చాలా మంది పిల్లలు హాజరై ఉత్సాహంగా నేర్చుకున్నారు. తర్వాత కూడా ప్రాక్టీస్ చేస్తాం.

– ఎస్.ప్రణయ్‌కుమార్, కొత్తగూడెం

రాణించేందుకు దోహదం



ఈ ఏడాది వేసవి ఉచిత శిక్షణ శిబిరాలకు క్రీడాకారుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ శిబిరం బుధవారంతో ముగియనుంది. నెల పాటు శిక్షణ తీసుకున్న ఔత్సాహికులు మరింత రాటుదేలేలా నిరంతరం ప్రాక్టీస్ చేస్తే బాగుంటుంది. తద్వారా పోటీల్లో రాణించడానికి వీలవుతుంది.

– దుంపల మల్లికార్జున్, అథ్లెటిక్స్ కోచ్

మీరెవరూ పార్టీలు మారలేదా? : కోరం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందు: ఇప్పటివరకు తానొక్కడినే పార్టీ మారి తప్పు చేసినట్లు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడటం విడ్డూరంగా ఉందని జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య ఘాటుగా విమర్శించారు. ఇల్లెందులో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు నాలుగు పార్టీలు మారిన చరిత్ర మీది కాదా అని ప్రశ్నించారు. మంత్రి పువ్వాడ తొలుత సీపీఐ, వైఎస్‌ఆర్‌సీపీ, కాంగ్రెస్‌ల నుంచి ఎమ్మెల్యేగా గెలిచి టీఆర్‌ఎస్‌లో చేరిన విషయం ప్రజలు మర్చిపోలేదన్నారు. ఆనాడు ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉంటే ఈ రోజు తనను విమర్శించే అర్హత ఉండేదన్నారు. ఇక ఎమ్మెల్యే హరిప్రియ, టీడీపీ, కాంగ్రెస్‌లను మోసం చేయలేదా అన్నారు. ఎదుటి వారి మీద మాట్లాడేటప్పుడు వెనక్కి తిరిగి చూసుకోవాలంటూ హితవు పలికారు. ఖమ్మం, ఇల్లెందులను వీరిద్దరే అభివృద్ధి చేసినట్లు.. ఐదుసార్లు గెలిచిన గుమ్మడి నర్సయ్య, ఊకె అబ్బయ్య, కోరం కనకయ్య ఏమీ చేయనట్లు మాట్లాడటం గర్హనీయమని పేర్కొన్నారు. రోళ్లపాడులో స్వయంగా సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన సీతారామ ప్రాజెక్టు అడ్రస్ లేదని, ఇప్పుడు కాలువలు తెస్తున్నట్లు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేవలం ఎన్నికలప్పుడే కాలువలు గుర్తుకు వస్తాయా అని ప్రశ్నించారు. చిన్న చిన్న కాంట్రాక్ట్ పనులతో ప్రస్థానం మొదలుపెట్టి ఈ స్థాయికి ఎదిగిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై తప్పుడు విమర్శలు చేయొద్దని హితవు పలికారు. ఉరికిస్తాం.. దాడులు చేస్తాం.. అని తనను ఉద్దేశించి అనడం వారి విజ్ఞతకే వదలేస్తున్నట్లు చెప్పారు. అయినా ఇది ప్రజాస్వామ్యమా, రౌడీ రాజ్యమా అని ప్రశ్నించారు. కాగా, జెడ్పీ చైర్మన్ పదవి తనకు ఊరికే రాలేదని ఎమ్మెల్యే పదవిని బీఆర్‌ఎస్‌కు ఇస్తే జెడ్పీ చైర్మన్ పదవి ఇచ్చారని కనకయ్య గుర్తు చేశారు. ఏదిఏమైనా రాజీనామా చేయాల్సిన అవసరం తనకు లేదని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ ఎదుటి వారికి దమ్ముంటే అవిశ్వాస తీర్మానం పెట్టుకోవాలని సూచించారు. ఇంకా ఈసమావేశంలో బోళ్ల సూర్యం, సూర్నపాక సత్యనారాయణ, బోగ నందకిషోర్, మండల రాము, పూనెం సురేందర్, ధనుంజయ్, తాటి భిక్షం, చిల్లా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నీ గెలుపులో నా కష్టం ఉంది : హరిప్రియ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: ఇల్లెందు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తాను మూడో వంతు సభ్యులతో కలిసి రాజ్యాంగ బద్ధంగా పార్టీ మారానని ఎమ్మెల్యే బానోతు హరిప్రియ స్పష్టం చేశారు. ఇక జెడ్పీ చైర్మన్‌గా కోరం కనకయ్య గెలుపుతో తన కష్టం ఉందని తెలిపారు. ఇల్లెందులో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను దూషిస్తున్న కనకయ్య.. ఏ పల్లె, తండాకు వెళ్లయినా తాను చేసిన అభివృద్ధిని ప్రజల నుంచి తెలుసుకోవాలని సూచించారు. ఇదే సమయాన ఆయన హయాంలో జరిగిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. సీతారామ ప్రాజెక్టు, బయ్యారం ఉక్కు, బస్ డిపో కోసం తాను పోరాడుతుండగా, ఆయన ఏం చేయలేకపోయారన్నారు. మంత్రి అజయ్‌కుమార్, సీఎం కేసీఆర్‌ను విమర్శిస్తే సహించబోమన్నారు. ఈసమావేశంలో దిండిగల రాజేందర్, జానీపాషా, పి.మాధవరావు, రేణుక, కృష్ణ, రంగనాథ్, మనోహర్ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం సరికాదు..



మాట్లాడుతున్న మందా నర్సింహారావు

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక సంఘాల ఐక్యతతో బొగ్గు గని కార్మికులకు మెరుగైన 11వ వేతన ఒప్పందం సాధించామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు పేర్కొన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలోని సెంట్రల్ వర్క్ షాపులో మంగళవారం ఆయన పతాకావిష్కరణ చేసి మాట్లాడారు. ఒక్క రోజు కూడా సమ్మె జరగకుండా, కార్మికులు నష్టపోకుండా చేయించిన అగ్రిమెంట్‌పై హెచ్‌ఎంఎస్ నేతలు కూడా సంతకాలు చేసి ఇప్పుడు తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. నాయకులు విజయగిరి శ్రీనివాస్, వై.వెంకటేశ్వరరావు, భూక్యా రమేష్, గడల నర్సింహారావు, కొత్తపల్లి రమేష్‌బాబు, కూరపాటి సమ్మయ్య, నాజర్, ఎస్.ఎం.రావు పాల్గొన్నారు.

బహిరంగ వేలంపాట

కొత్తగూడెంటౌన్: శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్‌టెంపుల్)కు చెందిన నాలుగు షాపులకు బుధవారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు మంగళవారం ఆలయ ఈఓ సులోచన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణేష్ టెంపుల్‌కు చెందిన మొత్తం 5 షాపులకు కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్మకాల కోసం బహిరంగ వేలంపాటను ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఆసక్తి కలిగిన వారు డిపాజిట్ చెల్లించాలన్నారు. వివరాలకు దేవస్థానంలోని టికెట్ కౌంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

అన్ని సంఘాలనూ ఆహ్వానించాలి

ఇల్లెందు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సింగరేణిలో జరిగే వేడుకలకు యాజమాన్యం అన్ని కార్మిక సంఘాలకు ఆహ్వానం పలకకుండా గుర్తింపు సంఘానికే పరిమితం కావడం సరికాదని పలువురు పేర్కొన్నారు. ఇకనైనా ఉత్సవాలకు అన్ని సంఘాలను ఆహ్వానించాలని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కార్యదర్శి లింగాల జగన్నాథం మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

గనిలో వెంటిలేషన్ మెరుగుపర్చాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి పీవీకే-5షాఫ్ట్ గనిలో వెంటిలేషన్‌ను మెరుగుపర్చాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎం.డీ.రజాక్ కోరారు. గనిలోని సీఎమ్మార్ ప్రాంతంలో మంగళవారం పరిశీలించిన ఆయన కార్మికుల సమస్యలపై గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్‌తో చర్చించారు. నాయకులు చిలక రాజయ్య, కూసన వీరభద్రయ్య, బి.రాజేశ్వరరావు, నాగార్జున, సంజీవరావు, సాంబయ్య, అమీర్, శ్రావణ్, చారి, రాజేశ్, కోటేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీ

పాల్వంచ: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష ఆదేశాల మేరకు మంగళవారం డిప్యూటీ డెమో ఎండీ ఫయాజ్ మోయుద్దీన్ ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను, డయాగ్నస్టిక్ సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి నిర్వాహకులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదం

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో హమాలీకి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి కథనం ప్రకారం... టేకులపల్లి మండలం దాసుతండా పంచాయతీ లచ్చతండా గ్రామానికి చెందిన హమాలీ భూక్యా శంకర్ మంగళవారం అయ్యప్ప ఆటోమొబైల్స్ వద్ద రోడ్డు దాటుతుండగా టేకులపల్లి వైపుకు వస్తున్న ట్రాలీ ఆటో తగలడంతో శంకర్ రోడ్డుపై బోర్లా పడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటన ఎలాంటి ఫిర్యాదు రాలేదని టేకులపల్లి ఎస్ఐ రమణారెడ్డి తెలిపారు.

ఆర్టీసీ రక్షణకు పోరాటాలే శరణ్యం



మాట్లాడుతున్న వీఎస్ రావు

చుంచుపల్లి: ఆర్టీసీని బతికించుకోవడానికి ఐక్య ఉద్యమాలు తప్పవని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకే ప్రైవేట్ బస్సులను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వమే బస్సులు కొనుగోలు చేసి ప్రజా రవాణా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. లాభాపేక్షతో చూడకుండా ప్రతిపల్లెకు బస్సులు నడపడమే కాకుండా ప్రభుత్వం బడ్జెట్లో రెండు శాతం నిధులు కేటాయించి ఆర్టీసీని కాపాడాలని కోరారు. రిటైర్మెంట్ కార్మికుల పరిస్థితి దుర్భరంగా ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులు 2013 నుంచి ఒకే రకమైన వేతనాన్ని పొందుతున్నారన్నారు. వేతన సవరణ చేసి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఏపీ రెడ్డి, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణా అడ్డగింత

పాల్వంచరూరల్: కొంతకాలంగా రాత్రి సమయంలో గుట్టుగా దళారులు మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం స్థానికులు లారీలను అడ్డుకుని నిలిపివేశారు. యానంబైల్ గ్రామశివారులోని రైతు పంటపొలం నుంచి రాత్రి సమయంలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న లారీలను స్థానిక యువకులు, సర్పంచ్ గోపి ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. అధిక లోడుతో అతివేగంగా లారీలను నడుపుతున్నట్లు తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జేకే ఓసీలో ఆడిట్ కమిటీ



ఆడిట్ కమిటీ అవగాహన ర్యాలీ

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీ వద్ద సేఫ్టీ జీఎం గురవయ్య ఆదేశాల మేరకు ఈ నెల 31 వరకు ఓసీలలో లైట్ మోటార్ వాహనాలు, వాటి కదలికలు, ఉద్యోగుల రవాణా కోసం ఇతర వాహనాలపై భద్రత అవగాహన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో మంగళవారం సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాసు, బొల్లం వెంకటేశ్వర్లు, గని మేనేజర్ పూర్ణచందర్, ప్రాజెక్టు ఇంజనీర్ చిన్నయ్య, శివప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారికే పట్టం కడదాం..



మాట్లాడుతున్న కామేష్

సుజాతనగర్: ప్రజా సమస్యలపై పాలకులను ప్రశ్నించే వారికే పట్టం కట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో నాయకులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిస్వార్థంగా పనిచేసే నాయకులనే గెలిపించాలన్నారు. అవినీతిని అంతమొందించాలంటే యువతతోనే సాధ్యమని, వారు రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు బీఎస్పీ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాలోత్ వీరునాయక్, నాగుల రవికుమార్, గుండేటి ఆదినారాయణ పాల్గొన్నారు.

రైతువేదికల్లో ఆవిర్భావ వేడుకలు



రైతు వేదికను పరిశీలిస్తున్న విద్యాలత

జూలూరుపాడు: తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగలా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ విద్యాలత అన్నారు. మంగళవారం పడమట నర్సాపురం రైతు వేదికను జెడ్పీ సీఈఓ విద్యాలత సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. జూన్ 2వ తేదీ నుంచి 22 వరకు జరిగే తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు పండుగ వాతావరణంలో జరుపుకోవాలని, అందుకు తగిన విధంగా రైతు వేదికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. జూలూరుపాడు, కాకర్ల, పాపకొల్లు రైతు వేదికలను ఎంపీడీఓ, తహసీల్దార్, ఏఓలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శారద, ఏఓ రఘుదీపిక, ఎంపీఓ పి.కృష్ణ, పడమటనర్సాపురం పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఏఈఓ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగర్జనకు తరలిరండి



పాల్వంచరూరల్: ప్రచారం చేస్తున్న విజయలక్ష్మి

పాల్వంచరూరల్: ఈనెల 4వ తేదీన కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరగనున్న సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభకు తరలివచ్చి జయప్రదం చేయాలని ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మిక వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి కోరారు. మండల పరిధిలోని జగన్నాథపురం, తోగ్గూడెం, నాగారం, పాండురంగాపురం, సత్యనారాయణపురం, ఉల్వనూరు, రేగులగూడెం తదితర గ్రామాల్లో మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు ప్రభావతి, వై.కాంతమ్మ, ధరావతు బుజ్జమ్మ, డాల ధనలక్ష్మి, పి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

టేకులపల్లి: జూన్ 4న లక్ష మందితో కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరగనున్న సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుగులోత్ రాంచందర్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకూ సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటామన్నారు. నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని, సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం ఆరు లక్షలు అందజేయాలని, కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు తగ్గించాలని, రైతులందరికీ రూ.లక్ష రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుగులోత్ శ్రీను, వాసం భద్రయ్య, అయిత శ్రీరాములు, తేజావత్ లక్ష్మణ్, సోని, వీరేందర్, మధు, కన్నయ్య, సతీష్ పాల్గొన్నారు.

చెత్తతో కంపోస్ట్ తయారు చేయాలి

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీలో తడి, పొడి చెత్తను ప్రతిరోజూ సేకరించి సెగ్రిగేషన్ చేసి వర్మీ కంపోస్ట్‌ను తయారు చేయాలని ఎంపీడీఓ బి.నారాయణ సూచించారు. మండల పరిధి బిక్కుతండా గ్రామంలో మంగళవారం స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి శిక్షణ, అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సామాజిక చిత్రపటంతో ఇంటింటికి తిరిగి వ్యక్తిగత మరుగుదొడ్డి, మ్యాజిక్ సోక్ ఫిట్ వివరాలను సేకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రతిఇంటిలో తిరిగి మ్యాజిక్ సోక్ ఫిట్ నిర్మాణం చేసుకోవాలని, పారిశుద్ధ్య పనులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. సమావేశంలో ఏపీఓ పొరండ్ల రంగా, ఉపాధి హామి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్..

టేకులపల్లి మండలం చంద్రుతండా పంచాయతీ సూర్యతండాలో గుగులోత్ వీరన్న సోదరుల పంట పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ పెట్టిన దిమ్మెలు ఒకవైపుకు ఒరిగి ఉండటంతో భారీ ఈదురు గాలులు, వర్షం పడినా పడిపోయే అవకాశం ఉంది. రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం ఈ ప్రాంతంలో తిరుగుతుంటారు. అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : పీబీ కన్నయ్య, విద్యుత్ ఏఈ, బొమ్మనపల్లి
సెల్ నెంబర్: 93923 88292